క్లుప్తంగా

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


కాళ్ల జిల్లా పరిషత్ హై స్కూల్

కాళ్ల: పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాళ్ల మండలంలో ఏర్పాటు చేసిన కాళ్ల హైస్కూల్‌లో 250, కోపల్లెలో 250, కలవపూడిలో 130, ఏలూరుపాడు జెడ్పీ హైస్కూల్‌లో 230 మంది చొప్పున మొత్తం 860మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు శనివారం తెలిపారు. 17 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు. 17న తెలుగు, 19న హిందీ, 21న ఆంగ్లం, 24న గణితం, 26న భౌతిక శాస్త్రం, 28న బయాలజీ, రంజాన్ పండుగ సందర్భంగా 31తేదీన లేదా ఏప్రిల్ 1వ తేదీ సాంఘికశాస్త్రం పరీక్షలు నిర్వహిస్తారని ఆయన స్పష్టం చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి పి.శివ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి మండల వ్యాప్తంగా నాలుగు కేంద్రాలు కేటాయించినట్టు దీనిలో భాగంగా పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థులు 110 మందికి, ప్రైవేట్ విద్యార్థులు 54 మందికి మోగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెగ్యులర్ విద్యార్థులు 104 మందికి, ప్రైవేట్ విద్యార్థులు 24 మందికి, గొల్లలకోడేరు జెడ్పీ హైస్కూల్ రెగ్యులర్ విద్యార్థులు 160 మందికి, శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్ రెగ్యులర్ విద్యార్థులు 226 మందికి, ప్రైవేట్‌విద్యార్థులు 26మందికి మొత్తం మండలవ్యాప్తంగా 704మంది విద్యార్థులకు ఈ నాలుగు కేంద్రాలు కేటాయించి కట్టుదిట్టమైన భద్రతల మధ్య పరీక్షలు నిర్వహించుటకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ వాహనంతో సివిల్ సప్లై అధికారులు

ఆకివీడు: అక్రమంగా తరలిస్తున్న ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డీటీ మహేష్ శనివారం చెప్పారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులో దాసరి శ్రీనివాస్‌కు సంబంధించిన రేషన్ బియ్యాన్ని లోడ్ చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి ఉండిలోని సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింట్‌లో అప్పగించి, కేసు నమోదు చేయించనున్నట్లు చెప్పారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నేతలు

భీమవరం: పట్టణంలోని వండర్ కిడ్స్ స్కూల్‌లో శనివారం విజ్ఞాన వేదిక అధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల పరిరక్షణ సమితి నాయకుడు మేళం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 500 పైగా వినియోగదారుల సంఘాలున్నాయన్నారు. వీటి ద్వారా వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ప్రిన్సిపల్ వాణి, న్యాయవాది ఉండపల్లి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న మొక్కలు

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. రూ.లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం నెరవేరకుండా పోతోంది. పట్టణంలో ఫలుధపాలుగా మొక్కలు నాటారు. వాటి సంరక్షణను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో గోదావరి గట్టు, వైఎన్ కళాశాల రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడంలేదు. దూడలు తినేయడం, నీరు పోయడం వంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కొన్ని చచ్చిపోయాయి.

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం : స్థానిక గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్ని చోట్ల పోయిన లైట్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడంలేదు. వలందరరేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. ప్రతి రోజూ ఏటిగట్టు ప్రాంతానికి సాయంత్రం వేళల్లో పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో షికారుకు వస్తారు. రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రేషన్ కార్డులకు మోక్షం కలిగేనా?

- కొత్త కార్డుల కోసం లబ్ధిదారుల పడిగాపులు
- ఆశతో ఎదురు చూస్తున్న పేద ప్రజలు
- గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- కనీసం మార్పులు, చేర్పులు కూడా లేవు


పాలకోడేరు మండల తహసీల్దార్ కార్యాలయం

పాలకోడేరు: కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారోనని అర్హులైన లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రేషన్‌కార్డుల కోసం ప్రతి రోజూ గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా కొత్త రేషన్ కార్డుల మంజూరుపై ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో అర్హులైన లబ్ధిదారుల నుంచి ఆందోళన వ్యక్తమవుతుంది. ఉండి నియోజకవర్గంలో వందల సంఖ్యలో పేద ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కాని నేడు పరిస్థితులు భిన్నంగా మారాయి. దీంతో ప్రజలు రేషన్ కార్డుల కోసం నిత్యం కాళ్లరిగేలా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాచారం రాకపోవడం లేదని వాపోతున్నారు.

పేరుకుపోతున్న దరఖాస్తులు

గతంలో కొత్తగా పెళ్లైన వారు తల్లిదండ్రుల కార్డు నుంచి తమ పేర్లు తొలగించాలని దరఖాస్తు చేసుకుంటే సచివాలయ సిబ్బంది వెంటనే వారి పేర్లను తొలగించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కార్డు వెబ్‌సైట్ పని చేయకపోవడంతో కొత్త జంటలు రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకుంటే అతీగతీ లేకుండా పోయింది. సచివాలయ సిబ్బందిని అడిగితే ఆప్షన్ రాలేదని సమాధానం చెబుతున్నారు. ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు, కాళ్ల ఆకివీడు ఉండి మండలాలు ఉన్నాయి. పాలకోడేరు మండలంలో 220, కాళ్ల మండలంలో 210, ఉండి మండలంలో 225, ఆకివీడు మండలంలో 215 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా 900కు పైగా నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్నారు.

కార్డు కోసం ఎదురు చూస్తున్నాం



నాకు వివాహమైనప్పటి నుంచి రేషన్ కార్డు కోసం ఆశగా ఎదురు చూస్తున్నా గ్రామ సచివాలయం వద్దకు పలుమార్లు తిరిగినా సిబ్బంది వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి.

– కారిపల్లి నాగేంద్రబాబు, వీరవల్లి పాలెం

రేషన్ కార్డు మంజూరు చేయాలి



రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నాను. దరఖాస్తులు ఎప్పుడు తీసుకుంటారని సచివాలయ సిబ్బందిని అడుగుతుంటే సరైన సమాధానం రావడం లేదు. గత ప్రభుత్వంలో ఇలా ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక అయోమయ పరిస్థితిలో పడ్డాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డు మంజూరు చేయాలి.

– ఎం.శ్యామ్, మోగల్లు

ఉత్తర్వులు రావాలి



నూతన రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం. అంత వరకు ప్రజలు ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగొద్దు. వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే మార్పులు, చేర్పులు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– నడింపల్లి భారతీవిజయలక్ష్మి, తహసీల్దార్, పాలకోడేరు

ముగిసిన అంతర్జాతీయ సదస్సు


అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

భీమవరం: విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్, సస్టైనబుల్ ఎనర్జీ సిస్టమ్స్ రెండో అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు మాట్లాడుతూ పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులకు స్మార్ట్ అండ్ సస్టైనబుల్ ఎనర్జీ సిస్టమ్స్‌లోని తాజా ఆవిష్కరణలు, అభివృద్ధిని పంచుకునేందుకు అంతర్జాతీయ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సదస్సు టెక్నికల్ చైర్ పర్సన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ యడ్ల రాజు మాట్లాడుతూ ఎనర్జీ సిస్టమ్స్‌లో ఏఐ అండ్ ఎంఎల్ స్మార్ట్ గ్రిడ్స్‌లో ఎల్‌ఓటీ, పునరుత్పాదక ఇంధన సాంకేతికతలకు సంబంధించిన ఆరు టెక్నికల్ ట్రాక్‌లు నిర్వహించామన్నారు. సదస్సుకు ఐదు దేశాలలోని ఏడు రాష్ట్రాల నుంచి వచ్చిన 153 పరిశోధన పత్రాల్లో 74 ఎంపిక చేసినట్లు చెప్పారు. సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి సత్కార, కర్ణాటక నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వై.సురేష్, వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సి.ధనంజయ్, ఆర్‌వీడీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి క్లాప్ వాహనాలు

సాక్షి స్పందన


చెత్తసేకరణకు క్లాప్ వాహనాలను ఉపయోగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

భీమవరం(ప్రకాశం చౌక్): గత ప్రభుత్వంలో జిల్లాలోని మున్సిపాలిటీలకు క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరిట చెత్త సేకరణ కోసం 149 క్లాప్ వాహనాలు ఇచ్చారు. జిల్లాలో పాలకొల్లులో మాత్రమే వాహనాలు ఉపయోగించుకుంటున్నారు. మిగిలిన మున్సిపాలిటిల్లో క్లాప్ వాహనాలు మూలనపడేశారు. దీనిపై ఇటీవల సాక్షిలో క్లాప్‌కు మంగళం శీర్షతో కథనం ప్రచురితమైంది. దీనిపై భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి స్పందించారు. నిరుపయోగంగా ఉన్న క్లాప్ వాహనాల్లో 15 వాహనాలకు మరమ్మతులు చేయించి గత మూడు రోజులుగా వాటిని చెత్త సేకరణకు ఉపయోగించుకుంటున్నారు. మిగిలిన మున్సిపల్ కమిషనర్లు కూడా స్పందించి క్లాప్ వాహనాలను ఉపయోగించుకుంటే ఆయా పట్టణాలు పరిశుభ్రంగా ఉంటాయి.

ఉన్నత విద్యతోనే దేశానికి మేలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

భీమవరం: పేదలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా తన కుటుంబానికే కాకుండా దేశానికి మేలు కలుగుతుందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల వ్యవస్థాపకుడు సాగి రామకృష్ణంరాజు గ్రామీణ ప్రాంతమైన చినఅమిరంలో ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి ప్రపంచానికి ఉత్తమ ఇంజనీర్లను అందించారన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణనిశాంతవర్మ అకాడమిక్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించారు. సీఎస్ఈలో 9.71 పర్సెంట్ మార్కులు సాధించిన బంక ధార్మిక్ పలు విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించి రికార్డు సృష్టించిన సందర్భంగా అంజిబాబు చేతుల మీదుగా సత్కరించారు. అలాగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు నగదు బహుమతులు అందించగా రాష్ట్ర స్థాయి అధ్యాపక క్రికెట్ టోర్నమెంట్‌లో నాలుగు సార్లు విజేతగా నిలిచిన కళాశాల అధ్యాపక క్రికెట్ బృందానికి రూ.80 వేల విలువైన క్రికెట్ కిట్‌ను అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌లో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 16వ తేదీన కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. చినఅమిరం ఫీడర్‌లో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రాలయం బైపాస్‌రోడ్ ఏరియాలోని కొన్ని ప్రాంతాలు, చినఅమిరం గ్రామంలో మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: ఏఎస్సార్ నగర్‌లోని ఇండోర్ విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో చినఅమిరం విద్యుత్ ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు తొలగించు నిమిత్తం ఆదివారం చినఅమిరంలో పూర్తిగాను, రాయలం గ్రామంలో బైపాస్ రోడ్ ఏరియాలో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అదే విధంగా ఆకివీడు సబ్‌స్టేషన్ల పరిధిలో ఆకివీడు, అజ్జమూరు, గుమ్ములూరు, పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు, ఆక్వా రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్


కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని వాటి పరిష్కారానికి ఈ నెల 17వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ చెప్పారు. ఈ నెల 8వ తేది నుంచి సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యలను తెలుసుకోడానికి ప్రజాచైతన్య సైకిల్ యాత్ర నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని 20 మండలాలు, 6 పట్టణాల్లో సుమారు 500 కిలో మీటర్ల యాత్ర సాగించామన్నారు. ప్రజాచైతన్య సైకిల్ యాత్ర ద్వారా పార్టీ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణతో జిల్లాలో పోరుబాటకు సిద్ధమవుతున్నట్లు గోపాలన్ చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కేంద్ర నాయకుడు వై రాము, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బివాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, మామిడిశెట్టి రామాంజనేయులు, కె క్రాంతిబాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద సీపీఐ ధర్నా

అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ హెచ్.చంద్రశేఖర్‌కు అందజేశారు. ధర్నాలో కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఎం.లక్ష్మీపతి, నామన వెంకటేశ్వరరావు, వైపీ ఆనంద్, సీహెచ్ సుందర్, ఖాన్‌భాషా, గుబ్బల సావిత్రి, కట్టా పద్మావతి, వి.గౌరమ్మ, బోడసింగ్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.74,424

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడి గ్రామదేవత శ్రీ ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల దేవస్థానంలో హుండీలను శనివారం లెక్కించారు. ఈ మేరకు రూ.74,424 ఆదాయం లభించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి గొట్టుముక్కల నాగసీతారామరాజు తెలిపారు. గత ఐదు నెలల కాలంలో భక్తులు అమ్మవారికి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా పై ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ఉండి: మండలంలోని ఆరేడు గ్రామంలో వేంచేసియున్న ముత్యాలమ్మ, కొండాలమ్మ, పోతురాజు ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులతో పాటుగా కలిగొట్ల, గణపవరం, సరిపల్లె, కోలమూరు, పాందువ్వ, ఉప్పులూరు, పాములపర్రు తదితర గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి, కనుమూరి భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో పోతిరెడ్డి సత్తిబాబు, కుంకట్ల శివ, పోలిశెట్టి బ్రహ్మానందం, కట్రెడ్డి బ్రహ్మానందం, పిచ్చుకుల సత్యనారాయణ, పోతుల లక్ష్మీనారాయణ, ఆరేటి ధనలక్ష్మీ, తోట రామాంజనేయులు, మద్దిశెట్టి కృష్ణవేణి, తిప్పిరిశెట్టి కృష్ణవేణి, తిప్పిరిశెట్టి హనుమంతురావు, నక్కా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెన్నుల అలంకరణలో కనకదుర్గమ్మ


పెన్నుల అలంకరణలో అమ్మవారు

భీమవరం(ప్రకాశంచౌక్): పదో తరగతి పరీక్షల సందర్భంగా మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారికి 2 వేల పెన్నులు, ప్యాడ్స్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈనెల 17 నుంచి జరగనున్న పదో తర గతి పరీక్షలలో భాగంగా శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలు గొల్లపల్లి శ్యామ్ వెంకట త్రియాన్స్ దంపతులు, వి.అన్విత్, శ్రీసత్యభాను, యర్రా సురేష్ దంపతులు, కాకులపాటి భానుమూర్తి దంపతులు, బస్వ రుద్రరావు దంపతులు, బండి సీతారామ స్వామి దంపతులు, చొడపనీడి కిషోర్ దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పెన్నులు, ప్యాడ్స్‌తో అలంకరణ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పెన్నులను, ప్యాడ్‌లను అందజేశారు.

లయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డు


ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

భీమవరం: లయన్స్ క్లబ్ ఉత్తమ అవార్డును అందుకుందని క్లబ్ కార్యదర్శి బొండా రాంబాబు శనివారం విలేకరులకు తెలిపారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం గత లయన్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అధ్యక్షతన నిర్వహించిన సేవా అవార్డ్స్ కార్యక్రమంలో అవార్డులను అందుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ఉత్తమ కార్యదర్శిగా బొండా రాంబాబు, ఉత్తమ కోశాధికారిగా కోట్ల నాని, ఉత్తమ క్లబ్‌గా భీమవరం అధ్యక్షుడు నడింపల్లి మహేష్‌కుమార్ అవార్డులను హైకోర్ట్ రిటైర్డ్ న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి, సీఐడీ రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందుకున్నట్లు వివరించారు. వబిలిశెట్టి కనకరాజు, సి.కృష్ణంరాజు, విశ్వనాథరాజు, రాయప్రోలు భగవాన్, రామ్‌కుమార్‌రాజు అభినందనలు తెలిపారు.

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

వైభవంగా వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెనుగొండ: పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామం ఆచంట వారి వీధిలో కొలువైయున్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల ఆలయ పునఃప్రతిష్ఠ వేడుక శనివారం కనులపండుగ నిర్వహించారు. వేదమూర్తి పూజ్యం దుర్గా సత్యనారాయణ మూర్తి మంత్రోచ్ఛరణల నడుమ ఆచంట రాము, నాగమణి, ఆచంట చిన్న, కస్తూరి, గుద్దటి దత్తాత్రేయ, కరుణ దంపతులచే వీరభద్ర స్వామి గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ఏర్పాటు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. తొలుత గోమాత దర్శనం, స్వామి వార్ల కల్యాణం, భక్తులచే శిఖరంపై బూరెలు వేయు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు, స్వామివారిని దర్శించుకొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి



భీమవరంలో ప్లాస్టిక్‌పై అవగాహన నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు

భీమవరం: స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కేజీఆర్ఎల్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రినిపల్ మెంటే హరనాథ్‌బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ సహజ వాతావరణంలో పేరుకుపోయి పర్యావరణ వ్యవస్థను దెబ్బతీస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐ.రామచంద్రమూర్తి, ఎంబీఏ డైరెక్టర్ సీహెచ్ వినోదరావు, ఇంటర్మీడియట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎంవీబీ గంగాధరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.కిరణ్మయి, కె.ఐజాక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

భీమవరం(ప్రకాశం చౌక్): స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఏఎస్ఆర్ నగర్‌లో ప్రజలకు సింగల్ యుజ్ ప్లాస్టిక్ నిషేధంపై మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువుల వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి హెల్త్ ఆఫీసర్ ఆర్.సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి


ఆకివీడు పట్టణంలోని చెత్తను తొలగిస్తున్న కమిషనర్ కృష్ణ మోహన్

ఆకివీడు: స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమాన్ని పలు పాఠశాలల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో నగర పంచాయతీ పరిధిలో శనివారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పాలిథీన్ కవర్లు, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. పట్టణంలో అపారిశుద్ధ్యం, వ్యర్థాలను కమిషనర్ జి.కృష్ణమోహన్ ఆధ్వ ర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, ఎంపీపీ హెచ్‌ఎం నారాయణ తొలగించారు. ప్రతి శనివా రం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.